కొద్దిరోజుల్లోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభల్లో మంత్రి పొంగులేటి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జూన్ 19 : కొద్దిరోజుల్లోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. హెల్త్ కార్డులు సహా వారి ఇతర సమస్యలన్నీ పరిష్కరిస్తామని అన్నారు. ఖమ్మంలో బుధవారం ప్రారంభమైన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర మూడో మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ అధ్యక్షతన జరిగిన మొదటి రోజు సభలో మంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీడియా అకాడమీ చైర్మన్‌గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని నియమించామని, జర్నలిస్టుల సమస్యలపై ఆయన సమగ్రంగా అధ్యయనం చేసిన వాటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందించారని వివరించారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇచ్చే విషయంలో ఒక సమగ్రమైన విధానాన్ని తీసుకొస్తున్నామన్నారు. ముందుగా ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తామన్నారు. మరో మూడు నెలల వరకూ అక్రిడిటేషన్లను రెన్యూవల్ చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చామన్నారు. అనంతరం, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వర్కింగ్ జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు లింగాల కమల్ రాజు, గుమ్మడి నర్సయ్య, ఎస్ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్, బల్వీందర్ సింగ్, రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, మాజిద్, వై.నరేందర్‌రెడ్డి, సోమసుందర్, కల్లూరి సత్యనారాయణ, ఆలపాటి సురేశ్‌కుమార్, కే.రాంనారాయణ, వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మందుపాతర పేలి మహిళ కాళ్లకు తీవ్రగాయాలు

మందుపాతర పేలి రెండు కాళ్లకు తీవ్ర గాయాలైన మహిళ

కొత్తగూడెం క్రైం, జూన్ 19 : ఏజెన్సీలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి మహిళకు తీవ్ర గాయాలైన ఘటన చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాద్‌పల్లికి చెందిన జ్యోతి అనే మహిళ పోలీస్‌స్టేషన్‌కి మూడు కిలోమీటర్ల దూరంలో నాద్‌పల్లి సమీపంలో ఉన్న కల్వర్టు మీదుగా వెళ్తోంది. ఈ క్రమంలో అక్కడ మావోయిస్టులు అమర్చిన మందుపాతర భారీ విస్ఫోటనం చెందింది. దీంతో ఆమె రెండుకాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఉసూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలికి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అక్కడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి కలెక్టర్, ఇన్‌చార్జ్ పీవో జితేశ్ వి పాటిల్

భద్రాచలం : విస్తా కాంప్లెక్స్ సమీపంలోని స్లూయిస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం/పర్ణశాల, జూన్ 19 : గోదావరి వరదల పట్ల అధికారులు, ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద పరిస్థితిని బట్టి ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్, ఇన్‌చార్జ్ పీవో జితేశ్ వి పాటిల్ అన్నారు. బుధవారం భద్రాచలం పట్టణంలో గోదావరి వరద వచ్చే ప్రదేశం, పర్ణశాలలోని పలు ప్రాంతాలను ఆయన పర్యటించారు. ముందుగా పట్టణంలోని విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న పంపింగ్ మోటర్లను, వరద ఎక్కువైనప్పుడు గోదావరిలోకి వదిలే ప్రదేశాలు, పరికరాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం కూనవరం రోడ్డులో కొత్తగా నిర్మించే కరకట్ట ప్రదేశాలు, వరద ముంపునకు గురయ్యే కొత్త కాలనీని పరిశీలించిన తర్వాత ఆయన మాట్లాడారు. గోదావరి వరద పెరిగే సమయంలో సీడబ్ల్యూసీ అధికారులు గంటకోసారి గోదావరి ఉధృతిని చూడాలని, వరద పెరిగే కొద్దీ పట్టణంలోని నీటిని మోటర్ల ద్వారా గోదావరిలోకి వదలాలని, అవసరమైతే అదనంగా మోటర్లను స్పేర్‌లో ఉంచుకోవాలన్నారు.

త్వరలో గిరిజన గ్రామాలు వరద తాకిడికి గురికాకుండా ప్రత్యేక చర్యలతోపాటు శాశ్వత పరిష్కారం చేపట్టాలని, అందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటి నుంచే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. మనుషులతోపాటు ఆవులు, గేదెలకు కూడా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఏటా వరద ముంపునకు గురవుతున్న పర్ణశాలలోని విద్యుత్ ఉప కేంద్రాన్ని పరిశీలించారు. వరదలు, వర్షాలకు పర్ణశాల విద్యుత్ ఉప కేంద్రం మునగడం వల్ల భగీరథ నీటి సరఫరాకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో విద్యుత్ ఉప కేంద్రాన్ని వరద ముంపు లేని ఎత్తయిన ప్రాంతానికి తరలించాలని అధికారులకు సూచించారు. చిన్నబండ్రేవు గ్రామంలో ఎకరం ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, రెవెన్యూ అధికారులు సూచించారు. విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రభుత్వం చూపించిన స్థలంలో త్వరగా నిర్మాణం చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పర్ణశాల పుణ్యక్షేత్రానికి భారీ సంఖ్యలో భక్తులు వస్తూ ఉంటారని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ ఉప కేంద్రం తరలించొద్దని కలెక్టర్‌ను కోరారు. అనంతరం పర్ణశాల జడ్పీ పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతు పనులను పరిశీలించారు. హెచ్‌ఎం సమ్మయ్యతో మాట్లాడుతూ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని, పూర్తిగా శిథిలావస్థలో ఉన్న భవనాలు మాత్రమే కూల్చివేయాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఆర్డీవో దామోదర్‌రావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, డీఈ వెంకటేశ్వరరావు, డీపీవో సుధీర్, తహసీల్దార్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఎంపీవో ముత్యాలరావు, సీఐ అశోక్, ఆర్ఐ ఆదినారాయణ, ఎస్సై కేశవ్, పీహెచ్‌సీ వైద్యులు రేణుకారెడ్డి పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు.. భారీ డంపు స్వాధీనం

ఘటనా స్థలం నుంచి జవాన్లు స్వాధీనం చేసుకున్న డంపు

కొత్తగూడెం క్రైం, జూన్ 19 : మావోయిస్టుల స్థావరంపై భద్రతా దళాలు దాడులు చేసి భారీ డంపును స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. సుక్మా జిల్లా ఎలమడగు అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో సీఆర్‌పీఎఫ్ 50వ బెటాలియన్, డీఆర్‌జీ భద్రతా దళాలు సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరపగా.. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య సుమారు 15 నిమిషాల పాటు భీకరపోరు సాగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు తమ స్థావరాన్ని విడిచి కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టులకు సంబంధించిన తుపాకులు, ఇతర మారణాయుధాలు, బ్యారల్ గ్రానెడ్ లాంచర్లు, ఇతర వస్తు సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. సుక్మా జిల్లాలో గడిచిన 24 గంటల్లో రెండుసార్లు ఎదురు కాల్పులు చోటు చేసుకోవడంతో పోలీస్ అధికారులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అప్రమత్తం చేశారు.

ట్రాక్టర్ పల్టీ.. హమాలీ మృతి

మృతిచెందిన శంకర్ (ఫైల్)

రఘునాథపాలెం, జూన్ 19: ట్రాక్టర్ పల్టీ కొట్టిన ప్రమాదంలో ఓ హమాలీ మృతిచెందాడు. మరో హమాలీకి తీవ్ర గాయాలయ్యాయి. రఘునాథపాలెం పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం నగరం ఖానాపురానికి చెందిన చెక్కల శంకర్ (47) హమాలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ట్రాక్టర్‌లో ఇనుప రాడ్లను ఖమ్మం నుంచి కామేపల్లికి తరలిస్తుండగా హమాలీలైన శంకర్, పేరబోయిన వెంకటేశ్‌లు ట్రక్కులో కూర్చున్నారు. ట్రాక్టర్ రఘునాథపాలెం దాటిన తరువాత ట్రాక్టర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్‌కు ఉన్న ట్రక్కు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శంకర్, పేరబోయిన వెంకటేశ్‌లపైకు ట్రక్కు పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, శంకర్ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి..

అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి

కౌలు రైతుల సదస్సులో రైతు సంఘం నేతలు సుదర్శన్, రాంబాబు

కౌలు రైతుల సదస్సులో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా టౌన్, జూన్ 19: కౌలు రైతుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నేతలు, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా తల్లాడలో సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకుడు మాదినేని రమేశ్ అధ్యక్షతన బుధవారం జరిగిన కౌలు రైతుల రాష్ట్ర సదస్సుల్లో సుదర్శన్, రాంబాబు మాట్లాడారు. ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలోని సాగుదారుల్లో 30 నుంచి 40 శాతం కౌలు రైతులే ఉన్నారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు భరోసా ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ ఆ హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా కౌలు రైతులకు భరోసా కార్డులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా హామీల్లో కోత పెట్టేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు.

'నేషనల్ సికెల్ సెల్ అనేమియా'పై అవగాహన

కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

ఖమ్మం సిటీ, జూన్ 19: నేషనల్ సికెల్ సెల్ అనేమియా ఎలిమినేషన్ మిషన్ గురించి జిల్లా వైద్యారోగ్యశాఖ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం గవర్నమెంట్ మెడికల్ కళాశాల విద్యార్థులకు బుధవారం కళాశాలలో అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి మాట్లాడుతూ.. ఈ వ్యాధి వల్ల రక్త హీనత, నొప్పి, చేతులు, కాళ్ల వాపు, దృష్టి సమస్యలు వస్తాయని వివరించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఎవరికైతే అనేమియా వ్యాధి ఉంటుందో వారికి ఆక్సీజన్ తగ్గి నొప్పి కలుగుతుందని అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. వచ్చే 2047వ సంవత్సరం నాటికి అనేమియా వ్యాధిని పూర్తిస్థాయిలో అరికట్టాలనే లక్ష్యంతో మాస్ మీటింగ్‌లు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం చిన్నారులకు స్క్రీనింగ్ చేయాలని సంకల్పించామన్నారు. ఖమ్మం ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కంబంపాటి నారాయణరావు మాట్లాడుతూ.. ఈ వ్యాధి పూర్తిగా నయం కాదని అన్నారు. కానీ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. అనంతరం దాదాపు 106 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రఘునాథపాలెం, జూన్ 19: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందిన ఘటన ఖమ్మం నగరం జయనగర్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. ఖానాపురం హవేలీ పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం నగరం ప్రకాశ్‌నగర్‌కు చెందిన మాదాసు రవి (35) ప్యాకర్స్ అండ్ మూవర్స్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. బుధవారం జయనగర్ కాలనీకి ప్రధాన రోడ్డు వద్ద ఓ ఫర్నీచర్ షాపు వస్తువులను సర్దుతుండగా ఫ్లెక్సీ బోర్డు ప్రమాదవశాత్తు విద్యుత్ లైన్‌కు తగిలింది. అది గమనించని రవి బోర్డును పట్టుకోగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే రవిని ఖమ్మం ప్రభుత్వా సుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. అతడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

అమ్మకానికి 60 బొగ్గు గనులు

హైదరాబాద్ వేదికగా రేపు వేలం వేయనున్న కేంద్రం



హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం మరోసారి వాణిజ్య బొగ్గు గనులను వేలం వేయనున్నది. ఈసారి ఇందుకు హైదరాబాద్ వేదిక అవుతున్నది. గతంలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు తదితర నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ 10వ విడుత కోల్ బ్లాక్స్ వేలాన్ని మాత్రం ఇక్కడ చేపడుతున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం (ఈ నెల 21) దేశవ్యాప్తంగా ఉన్న 60 బొగ్గు బ్లాక్‌లను మోదీ సర్కారు అమ్మకానికి తెస్తున్నది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వేలం ప్రక్రియను ప్రారంభిస్తారు. ఆ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, కార్యదర్శి అమృత్ లాల్ మీనాతోపాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఎంఎస్‌టీసీ ప్లాట్‌ఫామ్‌పై వేలానికి సంబంధించిన వివరాలను పొందుపర్చారు. పర్సంటేజ్ రెవెన్యూ షేర్ మాడల్ ఆధారంగా ఆన్‌లైన్‌లో బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తారు. ఇక ఈ గనుల్లో కోకింగ్, నాన్-కోకింగ్ బొగ్గు బ్లాకులున్నాయి.

• సింగరేణి పాల్గొనేనా..

ఈ బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందా? లేదా? అన్నది కూడా స్పష్టత రావాల్సి ఉన్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి నాడు వేలానికి దూరంగా ఉన్నది. కాగా, తెలంగాణలోని శ్రావణపల్లి బ్లాక్‌లో జీ-10 గ్రేడ్ బొగ్గు లభ్యమవుతుండగా, ఇక్కడ 119 మిలియన్ టన్నుల నిల్వలే ఉన్నట్టు తేల్చారు. దీంతో ఈ బ్లాక్‌పట్ల సింగరేణి ఆసక్తి చూపడం లేదు. ఆర్థికంగా అంత శ్రేయస్కరం కాదన్న భావనలో అధికారులున్నారు. ఇదే విషయంపై సింగరేణి సీఎండీ బలరాంను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. ఆర్థికంగా ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. తర్వాతే వేలంలో పాల్గొనాలా? వద్దా? అన్నది నిర్ణయిస్తామన్నారు.

వేలాన్ని అడ్డుకుంటాం: రాజిరెడ్డి

బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకొని సింగరేణిని కాపాడుకుంటామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లతోపాటు ఇతర ఖనిజ నిల్వలను వేలం వేయకుండా కాపాడిన విషయాన్ని కార్మికులు గమనించాలని, ప్రైవేటీకరణను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టంచేశారు. వేలం వేస్తే ఇటీవల కొత్తగా ఉద్యోగాల్లో చేరిన 20 వేల మంది కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు.

1.56 లక్షల కోట్లు

గత ఆర్థిక సంవత్సరం ప్రైవేట్‌పరమైన ప్రభుత్వ ఆస్తుల విలువ

వాటాల విక్రయం, డివిడెండ్లతో..

అందినకాడికి అమ్ముకుంటూపోతున్న మోదీ సర్కారు.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో వాటాల విక్రయం ద్వారా, ఆయా కంపెనీలిచ్చే డివిడెండ్లతో కూడా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నది. ఇప్పటికే చాలా సంస్థల్లో వాటాలను తగ్గించుకున్న కేంద్రం.. ఎయిర్ ఇండియా వంటి సంస్థలను అడ్డగోలుగా మొత్తం విక్రయించిన సంగతి విదితమే. ఇక ఒక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచే గత పదేండ్ల హయాంలో దాదాపు రూ.9 లక్షల కోట్లను డివిడెండ్‌గా అందుకున్నది. గత ఆర్థిక సంవత్సరానికైతే రికార్డు స్థాయిలో ఆర్బీఐ రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించినది తెలిసిందే. మిగతా ప్రభుత్వ సంస్థల నుంచీ పెద్ద ఎత్తునే డివిడెండ్ ఆదాయం వస్తున్నది. అయినప్పటికీ కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించకుండా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలకే కేంద్రం ఆసక్తి చూపుతుండటం ఇప్పుడు సర్వత్రా విమర్శలపాలవుతున్నది.

ఈ ఆర్థిక సంవత్సరం ఇంకో 2 లక్షల కోట్ల ఆస్తులు ఔట్

న్యూఢిల్లీ, జూన్ 19: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జాతీయ నగదీకరణ కార్యక్రమం (ఎన్ఎంపీ) కింద కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు రూ.1.56 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను అమ్మేసింది. నిజానికి రూ.1.80 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. బుధవారం వచ్చిన అధికారిక ప్రకటన ప్రకారం 2021-22 నుంచి 2024-25 వరకు మొత్తం నాలుగేండ్లలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మౌలిక రంగ ఆస్తులను అమ్మి రూ.6 లక్షల కోట్ల నిధులను సమీకరించాలని బీజేపీ సర్కారు నిర్దేశించుకున్నది. ఈ క్రమంలోనే 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు 2.30 లక్షల కోట్ల ఆస్తులను అమ్మేసింది.

వచ్చే మార్చికల్లా..

2023-24తో కలిపితే మూడేండ్లలో రూ.4 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించినట్టవగా, తొలి రెండేండ్లతో పోల్చితే తర్వాతి సంవత్సరంలోనే అత్యధికంగా అమ్మేయడం గమనించదగ్గ అంశం. ఇక లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే మార్చి నాటికి ఇంకా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను అమ్మాల్సి ఉన్నది. దీంతో త్వరలోనే మరింత సర్కారీ సంపద.. ప్రైవేట్‌పరం కాబోతున్నది. ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ 33 ఆస్తులను కూడా గుర్తించింది. కాగా, రోడ్డు రవాణా-జాతీయ రహదారులు, బొగ్గు, విద్యుత్తు, గనులు, పెట్రోలియం-సహజ వాయువు, పట్టణాభివృద్ధి, షిప్పింగ్ తదితర మంత్రిత్వ శాఖల్లో ఆస్తుల అమ్మకాలకు సంబంధించి పెట్టుకున్న లక్ష్యంలో 70 శాతం పూర్తయినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

గత ఆర్థిక సంవత్సరం కేంద్రం అమ్మేసిన ప్రభుత్వ ఆస్తులు

శాఖ	విలువ (రూ.కోట్లలో)
రోడ్డు రవాణా, జాతీయ రహదారులు	40,314
బొగ్గు	56,794
విద్యుత్తు	14,690
గనులు	4,090
పెట్రోలియం-సహజ వాయువు	9,587
పట్టణాభివృద్ధి	6,480
షిప్పింగ్	7,627
మరికొన్ని శాఖల్లో	16,500

ఏసీల ధరలకు రెక్కలు

8 శాతం వరకు భారీగా పెరిగిన విలువ

న్యూఢిల్లీ, జూన్ 19: ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తుండటంతో అంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో సామాన్యులు సైతం ఏసీలను కొనుగోలు చేస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో ఏసీల విక్రయాలు రికార్డు స్థాయి రెండంకెల వృద్ధి నమోదైంది. అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయన్న అంచనాతో వీటి ఉత్పత్తి సంస్థలు ఇదే అదనుగా ఏకంగా ధరలను కూడా భారీగా పెంచాయి. గతంలోనే ధరలను స్వల్పంగా పెంచిన సంస్థలు జూన్ నెలలో మరోసారి 6 శాతం నుంచి 8 శాతం వరకు సవరించాయి.

ఉత్పత్తి భారీ పెంపు..

డిమాండ్ అధికంగా ఉండటంతో ఏసీల తయారీ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచాయి కూడా. సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు ఉపక్రమించాయి. టాప్ కంపెనీలైన వోల్టాస్, ఎల్‌జీ, లాయిడ్‌లు ఏకంగా తమ కెపాసిటీని రెండింతలు పెంచుకున్నాయి. ఏసీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి లాయిడ్ పేరుతో ఏసీలను విక్రయిస్తున్న హావెల్స్ రూ.30-50 కోట్ల వరకు పెట్టుబడి కూడా పెట్టింది.

- ఈ ఏడాది ఏసీల విక్రయాలు 30-40 శాతం వృద్ధితో 1.5 కోట్ల యూనిట్లకు చేరుకుంటుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా.
- దక్షిణాది కంటే ఉత్తరాదిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో ఏసీ తయారీ సంస్థలు తమ ఏసీ స్టాక్‌లను దక్షిణాది నుంచి ఉత్తరాదికి తరలిస్తున్నారు.
- ఏసీల ఇన్‌స్టాలేషన్- సేవలు అందించే సిబ్బంది కొరత అధికంగా ఉన్నది.
- ఏసీల తయారీ సంస్థలైన వోల్టాస్, హావెల్స్‌లు తమ ఏసీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.
- డిమాండ్ అధికంగా ఉండటంతో విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి సంస్థలు. ముఖ్యంగా కంప్రెషర్లు, మోటర్లు, పీసీబీ సర్క్యూట్స్‌లు ఉన్నాయి.

ఈ ఏడాది ఏసీ ఇండస్ట్రీకి గోల్డెన్ ఈయర్. దేశవ్యాప్తంగా అత్యధిక రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో జూన్ నెలలోనూ అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి.

సంజయ్ చిత్కారా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్

120 కోట్లు దాటిన టెలికం కస్టమర్లు

న్యూఢిల్లీ, జూన్ 19: టెలికం వినియోగదారులు మళ్లీ 120 కోట్లు దాటారు. ఏప్రిల్ నెల చివరినాటికి దేశవ్యాప్తంగా 120.12 కోట్ల మంది టెలికం సబ్‌స్క్రైబర్లు ఉన్నారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 116.54 కోట్ల మంది ఉన్నా రు. టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. కొత్తగా జియో నెట్‌వర్క్‌ను 26.8 లక్షల మంది ఎంచుకోవడంతో మొత్తం సంఖ్య 47.24 కోట్లకు చేరుకోగా, అలాగే భారతీ ఎయిర్‌టెల్‌కు 7.52 లక్షల మంది జతవడంతో 26.75 కోట్లకు చేరుకున్నారు.

వాణిజ్య

టాటా కమర్షియల్ వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ, జూన్ 19: టాటా మోటార్స్ మరోసారి వాహన ధరలను పెంచింది. జూలై 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల కమర్షియల్ వాహన ధరలను 2 శాతం పెంచుతున్నట్లు బుధవారం ప్రకటించింది. కమోడిటీ ధరలు పెరగడం ఇందుకు కారణమని పేర్కొంది.

ఒమెగాలోకి 500 కోట్లు

హైదరాబాద్, జూన్ 19: హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రైవేట్ లిమిటెడ్(ఒమెగా హాస్పిటల్స్) తొలిసారిగా భారీ స్థాయిలో నిధులను సమీకరించింది. ఫండ్ మేనేజ్ మోర్గాన్ స్టాన్లీ నుంచి రూ.500 కోట్ల నిధులు సేకరించినట్లు బుధవారం వెల్లడించింది. మరిన్ని రాష్ట్రాలకు విస్తరించడానికి, ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు ఒమెగా హాస్పిటల్స్ ఎండీ మోహన్ వంశీ తెలిపారు.

ఎయిర్ ఇండియాలో ప్రీమియం క్లాస్ సీట్లు

ముంబై, జూన్ 19: వచ్చే నెల నుంచి ఎంపిక చేసిన రూట్లలో ప్రీమియం ఎకానమి క్లాస్ సీట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఇందుకోసం టాటా గ్రూపునకు చెందిన ఈ విమానయాన సంస్థ ఏకంగా రెండు ఏ320 నియో ఎయిర్‌క్రాఫ్ట్‌లను మార్చివేసింది. దీంట్లో ఎనిమిది సీట్లు బిజినెస్ క్లాస్ కోసం కేటాయించిన సంస్థ..24 సీట్లు ప్రీమియం ఎకానమి, మిగతా 132 సీట్లు ఎకానమి విభాగానికి చెందినవి.

బ్లూ డార్ట్ డ్రోన్ సేవలు

ముంబై, జూన్ 19: స్కై ఎయిర్ సహకారంతో డ్రోన్ ఆధారిత డెలివరీ సేవలను ప్రారంభిస్తున్నట్టు లాజిస్టిక్స్ ఆపరేటర్ బ్లూ డార్ట్ ప్రకటించింది. కాగా, 2021లో వికారాబాద్‌లో విజువల్ లైన్ ఆఫ్ సైట్ ట్రయల్స్ చేపట్టిన బ్లూ డార్ట్.. అప్పటి తెలంగాణ ప్రభుత్వ 'మెడిసిన్ ఫ్రం ది స్కై' కార్యక్రమం కింద స్కై ఎయిర్‌తో కలిసి బియాండ్ విజువల్ లైన్ ఆఫ్ సైట్ ట్రయల్స్‌నూ చేపట్టినది తెలిసిందే.